తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
నల్లగొండ,సూర్యాపేట,యాదాద్రి భువనగిరి





## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేత

**తిరుమలగిరి అక్టోబర్ 29 ప్రభాతవార్త**



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లు, పెన్నులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రామచంద్రంగౌడ్ మాట్లాడుతూ దాత సోమేష్ విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్‌లు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి అయిత శ్రీను, కోశాధికారి సురేష్‌కుమార్, కృష్ణమాచారి, సోమేష్, భాస్కర్, సుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన అద్దంకి దయాకర్

**తిరుమలగిరి అక్టోబర్ 29 ప్రభాతవార్త**



ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో పిహెచ్‌డి పూర్తి చేసుకొని డాక్టరేట్ పొందాడు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అద్దంకి దయాకర్ తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో మేనేజ్‌మెంట్ పద్ధతుల్లోఅమలు అధ్యయన అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. కంప్యూటర్ సైన్స్‌లో పరిశోధన చేసే అవకాశం ఉన్నా వైద్యంలో రావలసిన మార్పుల కోసం కామర్స్‌లో పిహెచ్‌డిచేయడం జరిగిందని ఆయన తెలిపారు. నా డాక్టరేట్‌కు సహకరించిన ప్రొఫెసర్ చెన్నప్ప, పివి.సరళ, యూనివర్సిటీ డాక్టర్ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# దేశంలోని దళితులందరికీ మోదీ ఆత్మబంధువు

**దేశ చరిత్రలో 12 మంది ఎస్సీలను కేంద్ర మంత్రులుగా చేసి దళిత జాతి గౌరవాన్ని కాపాడిన మోదీ**

**కెసిఆర్ దళిత సిఎం హామీని తప్పాడు**

**కొత్త సెక్రటేరియట్‌లో దళితుడిని సిఎంగా కూర్చోబెట్టాలని సవాల్**

**మునుగోడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

దేశంలోని దళితులందరికీ ప్రధాని నరేంద్ర మోదీ ఆత్మబంధువు, అంబేద్కర్‌ను దైవంగా భావిస్తున్న నేత, అంబేద్కర్ భిక్ష వల్లే నేను ప్రధాని అయ్యానని పార్లమెంట్ సాక్షిగా చెప్పిన గొప్ప నాయకుడు మోదీ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి దళిత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సిఎం కెసిఆర్ దళిత ద్రోహిగా మారారన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక దళితుల గౌరవాన్ని పెంచేందుకు, ఆర్థికంగా వాళ్ల కాళ్లపై వారు నిలబడేందుకు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు ఎన్నో స్కీమ్‌లను తీసుకువచ్చారని తెలిపారు. దేశ చరిత్రలో 12 మంది ఎస్సీలను కేంద్ర మంత్రులుగా చేసి దళిత జాతి గౌరవాన్ని కాపాడారన్నారు. నలుగురిని గవర్నర్లుగా, ఎంతో మందిని రాజ్యసభ సభ్యులుగా, ఎంపిలుగా అవకావమిచ్చిన గొప్ప పార్టీ బిజెపి అని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా బ్యాంకు మెట్లు ఎక్కని దాదాపు 3 కోట్ల మంది దళితులకు బ్యాంకు ఖాతాలు తెరిపించి నేరుగా ఆ నగదు లబ్దిని వారి ఖాతాల్లోనే జమ అయ్యేలా చేశారన్నారు. దళితులు ఉద్యోగాలు అడిగే వారు కాకూడదు. లైన్‌లో నిలబడేవారు కాకూడదదనే, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని అర్హులైన దళితులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా ఏకంగా రూ. 5 కోట్ల వరకు లోన్లు ఇచ్చే గొప్ప పథకాన్ని తీసుకువచ్చారన్నారు. దళిత యువకులు ఉన్నత విద్యనభ్యసించాలి, విదేశాల్లో చదువుకోవాలనే లక్ష్యంతో వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందన్నారు. ఇంతకు ముందు ఏటా 50 మంది దళిత విద్యార్థులను మాత్రమే విదేశాలకు పంపితే ఇప్పుడు ఏకంగా 500 మందికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చి విదేశాలకు




పంపుతుందన్నారు. ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నా బ్యాంకులు సహకరించవనే విషయాన్ని గమనించి దేశంలోని 1.25 లక్షల బ్రాంచిల్లో ప్రతి ఏటా ఒక్కరికైనా ఈ పథకం కింద లోన్ ఇవ్వాలని ఖచ్చితమైన నిబంధన తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా ఏటా 1.25 లక్షల మంది దళితులను పారిశ్రామికవేత్తలుగా మోదీ మారుస్తున్నారన్నారు. రాజగోపాల్‌రెడ్డి గెలిస్తే మునుగోడు యువకులకు కోట్ల రూపాయల లోన్లు ఇప్పించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను దారుణంగా అవమానించిందన్నారు. దళితుల హక్కుల కోసం పార్లమెంట్‌లో ప్రశ్నిస్తే నెహ్రూ కుదరదన్నాడని తెలిపారు. అప్పుడు ఇట్లయితే రాజీనామా చేస్తానని అంబేద్కర్ హెచ్చరించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో నిలబడితే ఎవరో అనామకుడిని నిలబెట్టి ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేసి అంబేద్కర్‌ను ఓడించిన దుష్ట చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంబేద్కర్‌ను దైవంతో సమానంగా చూస్తున్నారని, వేల కోట్లు ఖర్చు పెట్టి అంబేద్కర్ జీవితంతో అనుబంధం ఉన్న ఐదు స్థలాలను పంచతీర్థాలుగా అభివృద్ధి చేశారన్నారు. ఆయన జ్ఞాపకాలు వందల ఏళ్ల వరకు భవిష్యత్ తరాలకు గుర్తుండాలని మోదీ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కెసిఆర్ అడుగడుగునా అంబేద్కర్‌ను అవమానిస్తూనే ఉన్నాడని విమర్శించారు. ముఖ్యంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నాడని, ఎందుకంటే దళితుడు అనే పదాన్ని పదే పదే ఉచ్చరించడం ఇష్టం లేకనే ఆయన కల్వకుంట్ల రాజ్యాంగం రాస్తానంటున్నాడన్నారు. అన్నింటికి మించి సిఎంవోలో దళిత అధికారులను దగ్గరకు కూడా రానివ్వడం లేదని, గొప్ప గొప్ప ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను సైతం అవమానించిన ఘటనలు కోకొల్లలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లిస్తున్నాడని ఆరోపించారు. కెసిఆర్ తన కేబినెట్‌లో ఎంత మంది దళితులకు అవకాశం కల్పించాడని, ఎస్సీ కమీషన్‌ను నియమించకుండా చాలా కాలం ఎందుకు జాప్యం చేసావన్నారు. దళితుడిని సిఎం చేసి కొత్త సెక్రటేరియట్‌లో కొత్త కుర్చీలో దళితుడిని సిఎంగా కూర్చోబెట్టాలని ఆయన కెసిఆర్‌కు సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి తరుణ్‌చుగ్, ఈటెల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, గంగిడి మనోహర్‌రెడ్డి, బొడిగె శోభ, బాబూమోహన్, చంద్రశేఖర్, విజయ రామారావు, కొప్పు భాషా, మునుస్వామి, దళిత నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి నుండి టిఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు

**మర్రిగూడ, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



మండలంలోని శివన్నగూడ గ్రామం బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీగా శనివారం టిఆర్‌ఎస్‌లో చేరారు. టిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కర్నాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త, సీనియర్ జిల్లా నాయకులు రాపోలు యాదగిరి, మండల సీనియర్ నాయకులు చిట్యాల రంగారెడ్డి, నర్సింహ, మూర నర్సింహ, చిన్న నర్సింహ, సోమయ్య, యాదయ్య, జిల్లా నర్సింహ, నాగరాజు, వార్డు సభ్యులతో సహా పలువురు టిఆర్‌ఎస్‌లోకి చేరారు. ప్రగతి భవన్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌ల సమక్షంలో టిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీలో చేరిన వారికి గులాబి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

## దేశాన్ని దోపిడిదారులకు అమ్మేసే బిజెపిని ఓడించాలి

**మర్రిగూడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త**



పచ్చని తెలంగాణలో నిప్పుపెట్టే మతోన్మాద బిజెపిని ఓడించి వామపక్షాలు బలపర్చిన టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో మండల పరిధిలోని శివన్నగూడంలో ప్రారంభమైన మోటార్ సైకిల్ యాత్ర ఇందుర్తి, సరంపేట, రామిరెడ్డిపల్లి, మర్రిగూడ, భట్లపల్లి, లింగోటం, వడ్డేపల్లి, చిట్టంపహాడ్, నాంపల్లి తదితర గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాజగోపాల్‌రెడ్డి బిజెపికి రూ. 18 వేల కోట్లకు అమ్ముడుపోయి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడన్నారు. బిజెపి తన కుట్ర బుద్ధితోనే తెలంగాణ రాష్ట్రంలో మత ఉన్మాదపు అలజడులు సృష్టించడానికి ప్రజల మధ్య అశాంతి నెలకొల్పడానికి పూనుకుంటుందన్నారు. దేశంలో మత రాజకీయాలకు అవకాశం లేదని, మతోన్మాదులను అధికారానికి దూరంగా ఉంచాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డబ్బులతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్రలు చేస్తున్నారని, ప్రజలు వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో మెజార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు పాలడుగు నాగార్జున, పినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్ హాషం, ఏర్పుల యాదయ్య, నాంపల్లి చంద్రమౌళి, ఎండి సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, శ్రీనివాసనాయక్, వెంకటరాములు, ముత్తిలింగం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా గంజి వెంకటేశ్వర్లు

**నాగార్జునసాగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త:**



తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా నాగార్జునసాగర్ నివాసి అయిన గంజి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఇందుకు సంబందించి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ వీరికి ఉత్తర్వులు అందజేశారు. శనివారం హైద్రాబాద్‌లో జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత సమస్యల పరిష్కారం కొరకు జరిగే ఉద్యమాలను పటిష్టం చేయడం జరుగుతుందన్నారు. చేనేతపై జీఎస్టీ ఎత్తి వేయాలని డిమాన్ చేశారు. చేనేతల సమస్యల పరిష్కారం కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరగుతుందని అన్నారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రాపోలు పరమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**మాడ్గులపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐకెపిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రామలింగయ్య అన్నారు. శనివారం మాడ్గులపల్లి మండలంలోని గుర్రప్పగూడెం, ఆగామోత్కూర్, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, గ్యారాకుంటపాలెం గ్రామాలల్లో ఐకెపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అరకొర ధరకు దళారీలకు విక్రయించి మోసపోకుండా అందుబాటులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న గరిష్ట మద్దతు ధర క్వింటాళ్లుకు రూ.2060 పొందాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే సమయంలో తమ పట్టదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్ పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్ తీసుకుని వచ్చినట్లయితే సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## తెలంగాణ ప్రజలను వంచించిన కెసిఆర్‌కు బద్ది చెప్పాలి

**బిజెపి ముసుగు రాజకీయాలను తరిమికొట్టాలి**

**మునుగోడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**




తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలను వంచిస్తున్నాడని, అమరుల త్యాగాలను, ఉద్యమ ఆకాంక్షలను మరిచి అక్రమ సంపాదన, ఆధిపత్య రాజకీయాల కొరకే తహతహలాడుతున్నాడని, మునుగోడు ఎన్నికల్లో కెసిఆర్‌కు బుద్ది చెప్పాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. మునుగోడు ఉప ఎన్నికల్లో తెలంగాణ జన సమితి అభ్యర్థి పల్లె వినయ్‌కుమార్‌గౌడ్ గెలుపును కాంక్షిస్తూ శనివారం తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో తూప్రాన్‌పేట నుండి నాంపల్లి వరకు నిర్వహించిన తెలంగాణ జన సమితి జనయాత్రలో ఆయన పాల్గొని నియోజకవర్గంలోని వివిధ మండల కేంద్రాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బిజెపి ఒక వ్యక్తి స్వార్ధం కోసం ఎన్నికలకు తీసుకువచ్చిందన్నారు. టిఆర్‌ఎస్ పార్టీ ఏమో తన ఆధిపత్యం నిరూపించుకునేందుకు ఎన్నికలను వ్యాపారంగా అత్యంత అప్రజాస్వామికంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఓటర్లను వివిధ రూపాల్లో మభ్యపెడుతూ బేరాలాడుతున్నారని, రెండు పార్టీలకు ఓటర్లను ఓట్లు అడిగే నైతిక అర్హత లేదన్నారు. స్థానిక ప్రజా సమస్యలను ఈ ఎన్నికల్లో ఎజెండాగా చర్చింకుండా కేవలం తమ ఆధిపత్యం కోసం పరస్పర రాజకీయ విమర్శలతో పబ్బం గడపుకుంటున్నాని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో ఉన్నటువంటి స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ఇరు పార్టీలె విఫలమయ్యాయని, వీరి వైఫల్యం మూలంగా చౌటుప్పల్ ప్రజలు కాలుష్యం బారిన పడ్డారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను నిర్ధారించడంలో రెండు పార్టీలు దొంగాట ఆడుతున్నాయని జిల్లా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నిరంతరం ప్రజా ఉద్యమాల్లో ఉండే తాను నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని, అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అక్రమంగా రద్దు చేసిన దళితుల, గిరిజనులకు భూపట్టాలు ఇప్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అంబటి శ్రీనివాస్, ధర్మార్జున్, గోపగాని శంకర్‌రావు, బైరి రమేష్, ఆశప్ప, నిర్జన రమేష్, కార్యదర్శులు బొక్కన కనకయ్య, ముక్కెర రాజు, నరసయ్య, సలీంపాషా, లక్ష్మి, బాబు, మోహన్‌రెడ్డి, మల్లెల రామనాధం తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**చండూరు రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



నేడు చండూరులో నిర్వహించే ముఖ్యమంత్రి కెసిఆర్ బహిరంగ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మెల్సీలు తక్కెళపల్లి రవీందర్‌రావు, సారయ్యలు పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు మధ్యాహ్నం 3 గంటలకు చండూరులో ముఖ్యమంత్రి కెసిఆర్ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు వారు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం మండలాల వారీగా వేర్వేరుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మునుగోడు ఉప ఎన్నిక వెనుక ఆంతర్యం వేరే ఉందని, రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు తీసుకుని రాజగోపాల్‌రెడ్డి బిజెపిలో చేరాడన్నారు. కెసిఆర్ బిఆర్‌ఎస్ పెట్టగానే బిజెపి ఉలిక్కి పడుతుందన్నారు. బిజెపి పీఠాలు కదిలిపోతున్నాయన్నారు. తెలంగాణ మోడల్ దేశం యావత్ కావాలని డిమాండ్లు వస్తుంటే బిజెపి వాళ్లకు నిద్ర పట్టడం లేదన్నారు. అందుకే ముఖ్యమంత్రిని తెలంగాణ వరకే పరిమితం చేయాలని ఉప ఎన్నిక తెచ్చారన్నారు. మునుగోడులో వందల కోట్లు గుమ్మరిస్తూ నాయకులను కొంటూ జుగుప్సాకరంగా బిజెపి వ్యవహరిస్తుందన్నారు. కెసిఆర్ పాలనను అంతం చేయాలని అమిత్‌షా, మోదీ భారీ కుట్ర చేశారన్నారు. బిజెపి బాగోతంపై ఆడియోలు, వీడియోలు బయటకు వస్తున్నాయన్నారు. ఇవన్నీ కెసిఆర్ బహిరంగ సభలో వెల్లడించి బిజెపి బండారం బయటపెడతారన్నారు. అభివృద్ధిలో పోటీ పడలేక బిజెపి దొంగ చాటుగా దెబ్బతీయాలని కుట్ర చేసిందన్నారు. మునుగోడులో విజయం టిఆర్‌ఎస్‌దేనన్నారు.

## దుబ్బ కాలువలో టిఆర్‌ఎస్ విస్తృత ప్రచారం

**మునుగోడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త**

మండల పరిధిలోని దుబ్బ కాలువలో శనివారం టిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మునుగోడు ఉప ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ఇంటింటికి తిరుగుతూ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కల్పించిన ఘనత టిఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్, సర్పంచ్ సాధు భిక్షమయ్య, ఉపసర్పంచ్ కొండ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు పగడాల నాగరాజు, కౌన్సిలర్ వలిరాజు, కమ్మలపల్లి యాదగిరి, దోటి స్వామి, కొండా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జోడో యాత్రలో పాల్గొన్న ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు

**తిరుమలగిరి అక్టోబర్ 29 ప్రభాతవార్త**



భారత్ జోడో యాత్రలో భాగంగా మహబూబ్‌నగర్‌లో రాహుల్‌గాంధీ జోడో యాత్రలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్ రాహుల్ గాంధీని కలిసి జోడో యాత్రలో పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌యుఐ నాయకులు కొండా రాజు, రషీద్‌ఖాన్, యశ్వంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దిన ఘనత కెసిఆర్‌దే: ఎర్రోళ్ల శ్రీనివాస్

**మర్రిగూడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త**



70 ఏళ్ల ఉమ్మడి రాష్ట్ర పరిపాలనలో ఫ్లోరైడ్ చేత అతలాకుతలం అవుతున్న ఈ ప్రాంతాన్ని ఫ్లోరైడ్ రహిత ప్రాంతం తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌దేనని మెడికల్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని భట్లపల్లి గ్రామంలో ఫ్లోరైడ్ భాదితులతో కూర్చుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రభుత్వ సంక్షేమాలు అన్ని విధాలుగా తమ గ్రామానికి అందాయా అని వివరాలను సేకరించారు. అందుకు గ్రామంలోని మహిళలు మాకు అన్ని సంక్షేమాలతో పాటు వృద్దాప్య, వికలాంగుల పెన్షన్లు కూడా అందాయని స్పష్టం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్వార్ధం కోసమే వచ్చాయని తెలిపారు. బిజెపిలో కార్యకర్తలను చేర్చుకునేందుకు సంతలో పశువులు, కూరగాయల్లా కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులతో మాట్లాడుతూ ఓటెవరికి వేస్తారని అడగగా మూకుమ్మడిగా కారు గుర్తుకే ఓటు వేసి టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్లను గెలిపించేందుకు పూర్తి సహకారం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ జంగయ్య, పల్లా ప్రవీణ్‌రెడ్డి, బూడిద సురేష్, మహేందర్, రమేష్, నరేందర్, సురేష్, మల్లేష్, వి. ముత్యాలు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు

**మునుగోడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలోని 11వ వార్డులో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో టిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అజయ్‌కుమార్ పార్టీలో చేరిన వారికి గులాబి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛంధంగా పార్టీలో చేరుతున్నారన్నారు. మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఉప ఎన్నికల్లో టిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్ధిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. మూడున్నరేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తన వ్యక్తిగత స్వార్ధం, కాంట్రాక్టుల కోసం పదవికి రాజీనామా చేసి బిజెపిలో చేరి నమ్మిన ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజా వంచనకు పాల్పడిన రాజగోపాల్‌రెడ్డిని ఉప ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అద్దంకి భారతమ్మ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

**నేరేడుచర్లటౌన్ అక్టోబర్ 29 ప్రభాతవార్త**



హరితహారం కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపాల్టీ పరిధిలో నాటిన కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలనిశుక్రవారం మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. క్లోరో కార్పస్ చెట్ల వలన ఆక్సిజన్ తగ్గిపోయే ప్రమాదం ఉందని, శ్వాస సంబంధమైన జబ్బులు వస్తాయని, 80 మీటర్ల మేర దాని వేర్లు పాకిపోయి భూగర్భ జలాలు అంతరిస్తాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నందున మున్సిపాల్టీపరిధిలోని నాటిన మొక్కలు పెద్దచెట్లుగా మారాయని, ప్రజలకు అనారోగ్యం కలగకుండా ఈ చెట్లను తొలగించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సామాజిక కార్యకర్తలు సుంకరి క్రాంతికుమార్, జింకల భాస్కర్, కొప్పు రామకృష్ణగౌడ్,యారవ సురేష్, జంపాల శ్రవణ్, ఆకుల సతీష్, చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సినీనటుడు నాగబాబు జన్మదిన వేడుకలు

**నేరేడుచర్లటౌన్ అక్టోబర్ 29 ప్రభాతవార్త**



సినీ నటుడు నాగబాబు జన్మదిన వేడుకలను నేరేడుచర్లలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తరికొప్పుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిచరణ్, శ్రీను, గంట సైదులు, యూసుఫ్, దాసరి వాసు, మచ్చ పవన్, కల్యాణ్, ప్రసాద్, రాకేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే విధమైన పని వేలలు పాటించాలి

**నల్లగొండ అర్బన్ అక్టోబర్ 29 (ప్రభాతవార్త)** ప్రభుత్వ అన్ని గురుకుల మాదిరిగానే బిసి గురుకుల విద్యాలయాల్లో కూడా ఒకే రకమైన సమయా పాలన పాటించలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎడ్ల సైదులు పేరుమాళ వెంకటేశం లు డిమాండు చేశారు. యుటీఎఫ్ అద్వర్య0లో బిసి గురుకులలో భోజన విరామ సమయం లో నల్లా బ్యాడ్జిలు దరించి జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో గురుకులాలతో సహా అన్ని విద్యాసంస్థల్లో బోధనా సమయం 9గంటల నుండి 4.30 గంటలవరకు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం. 3ను 2015 లో విడుదల చేసింది అన్నారు. జీవో 3 ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలను నడపాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆయా సొసైటీల కార్యదర్శులకు, ప్రభుత్వానికి గత నాలుగు సంవత్సరాలుగా చేసిన ప్రాతినిధ్యాల ఫలితంగా సాంఘీక, గిరిజన, మైనారిటీ సంక్షేమ గురుకులాల్లో కాలపట్టికను ఆగస్టు



నెలలో మార్చారు. కానీ మహాత్మా జోతిరావు ఫూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల పాఠశాలల బోధనా సమయాన్ని ఇంకా మార్చ లేదు అని వాపోయ్యరు. నూతనంగా నెలకొల్పిన గురుకుల విద్యా సంస్థలు అన్నీ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని. విద్యార్థులకు సరిపడిన మౌలిక వసతులు లేకపోవడంతో 90% పాఠశాలల్లో ఉదయం విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, పాఠశాలకు సిద్ధం కావడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కావున బిసి గురుకులాల్లో కూడా బోధన సమయం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4.30 వరకు ఉండేలా మార్చాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ ప్రాతినిధ్యం మేరకు బిసి గురుకులాల కాలపట్టికను కూడా మారుస్తామని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి హామీ ఇచ్చినప్పటికీ సొసైటీ అధికారులు ఉత్తర్వులు ఇవ్వక పోవడం విడ్డూరంగా ఉందని, తెలంగాణలో ప్రభుత్వ గురుకులాల్లో ఉపాధ్యాయులకు ఒకే విధమైన వేతనాలు అమలు చేస్తున్నందున, పని వేళలు కూడా ఒకే విధంగా ఉండాలని కోరారు. శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో నల్లగొండ జిల్లా కార్యదర్శులు గేర నర్సింహ్మా, రమాదేవి, గురుకులాల కన్వీనర్ నరేష్, కో-కన్వీనర్ మధు, వివిధ మండలాల బాధ్యులు మరియు బిసి గురుకులాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల చవితి వేడుకలు

**నల్లగొండ అర్బన్ అక్టోబర్ 29 (ప్రభాతవార్త)** నల్లగొండ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోకార్తీక శనివారం నాగుల చవితి సందర్భంగా దేవాలయంలో గల నాగేంద్ర స్వామికి, సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు, అర్చనలు ఆలయ అర్చకులు పవన్ శర్మ, సాయి శర్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న పద్మావతి ఉద్యానవనం (పార్క్)లో గల పుట్ట వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నాగేంద్రునికి పసుపు కుంకుమ పూలతో అలంకరించి పాలు, పండ్లు తదితర నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహణ కమిటీ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ,భక్తులు,





మహిళలు స్వామివారిని దర్శించుకొని పూజలలో పాల్గొన్నారు.

## గడ్డి కొండారం మత్స్య సొసైటీ ఏర్పాటు చేయలి

**లోకనబోయిన రమణ ముదిరాజ్**
**నల్లగొండ అర్బన్ అక్టోబర్ 29 (ప్రభాతవార్త)**



తిప్పర్తి మండల్ గడ్డి కొండారం గ్రామానికి చెందిన చెరువుకుంటలను మత్స్య పారిశ్రామిక సహకార సంఘంగా రిజిస్ట్రేషన్ చేసి ముదిరాజ్ మత్స్యకారులకు సభ్యత్వం కల్పించాలని టీ అర్ ఎమ్ ఎస్ రాష్ట అద్యక్షులు లొకనబొయిన రమన ముదిరాజ్ కోరారు. శనివారం నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్యకు దరఖాస్తు అందజేసారు. ఈ సందర్భంగా టీఆర్ ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు లోకనబోయిన రమణ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామంలోని చెరువులో ఎన్నో ఏండ్ల నుంచి చాపలు పట్టి జీవనం గడుపుతున్న మత్స్యకార సోదరులు 30 మందికి నూతన చెరువు సొసైటీ ఏర్పాటు చేసి సభ్యత్వాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. మునుగోడు ఎలక్షన్స్ లో ముదిరాజ్ బిడ్డ అయినటువంటి గొడుగు వెంకటేష్ ముదిరాజు గుర్తు ట్రాక్టర్ టిల్లర్‌కు ఓటు వేసి ముదిరాజ్‌ల ఐక్యత బలాన్ని చూపించాలని మునుగోడు ముదిరాజ్ ఓటర్లను కోరుతున్నామన్నారు. దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు పుట్టకోటయ్య ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్‌లని చిన్న చూపు చూస్తుందని ఎమ్మెల్యే మంత్రి పదవులు మరియు నామినేటెడ్ పోస్టులు ఇవ్వకపోవడం వలన యావత్ ముదిరాజ్ జాతి ఆగ్రాహ వేషాలతో ఉందని, బీసీఏ రిపోర్టు వెంటనే పంపించాలని లేనిచో ముదిరాజ్‌ల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సింగారం మల్లయ్య ముదిరాజ్, జిల్లా యువత టీఆర్ఎస్ అధ్యక్షుడు కుంభం సూర్య ముదిరాజ్, కె శ్రీను, మేకల సైదులు, టీ సైదులు, బీ రాములు, కే సైదులు, ఎన్ లింగయ్య, ఎన్ నరేష్, మహేష్, టీ శ్రీను, బీ రమేష్, ఎన్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలే టీఆర్ఎస్ గెలుపునకు శ్రీరామరక్ష

**ఆలేరు టౌన్, ప్రభాతవార్త**



టిఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే మునుగోడు ఉప ఎన్నికల్లో గెలుపుకు శ్రీరామరక్ష అని టీఆర్ఎస్ పార్టీ 6 వార్డు బహదూర్ పేట సీనియర్ నాయకులు వస్పరి మల్లేశం అన్నారు. శనివారం మునుగోడులో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఓటర్‌కు వివరిస్తూ ఉప ఎన్నికల అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ సారథి అయిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని నవంబర్ 3న జరిగే పోలింగ్ లో కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాయపురం నర్సింహులు, పట్టణ సెక్రటరీ జెనరల్ కుండే సంపత్, పట్టణ ఉపాధ్యక్షులు దింతుల ఎల్లేష్, వార్డు అధ్యక్షులు వస్పరి బాలయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కుళ్ళ వెంకటేష్,యూత్ అధ్యక్షులు పల్లె మహేష్, రాయపూరం శేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

**ఆలేరు టౌన్, ప్రభాతవార్త**



ఆలేరు పట్టణ కేంద్రంలో పురపాలక మొదటి వార్డు కు చెందిన జమ్ముల శ్రీధర్ మరియు బిరుదు రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని బీర్ల ఫౌండేషన్, బీర్ల అయిలయ్య సహకారం తో వారి కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు ఎం ఏ , ఏజాస్ , వార్డ్ కౌన్సిలర్ చింతల పాణి సునీత శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ జైనుదిన్,దారపు శంకర్, ప్రధాన కార్యదర్శి మల్లెల శ్రీకాంత్,పత్రె రమేష్, మండల్ యూత్ అధ్యక్షులు కలకుంట్ల లోకేష్,విక్రమ్,బంద్రు జహంగీర్, తేజవత్ నరేష్,టౌన్ వైస్ ప్రెసిడెంట్ కాసుల భాస్కర్, జల్లి నాగరాజు,బోడ శ్రీకాంత్ ఎన్ ఎస్ యూ ఐ టౌన్ అధ్యక్షులు జావీద్,యాకుబ్, భాను, తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధమైన బోధనతో మెరుగైన ఫలితాలు

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



ప్రణాళిక బద్ధమైన బోధనద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచునని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయిలో మౌళిక భాషా, గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమం నిర్వహణ పర్యవేక్షణ కొరకు జిల్లా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరగతి బోధన, అభ్యాసన ప్రక్రియలు ఆకర్షనీయంగా ఉండాలని, ఉపాధ్యాయులు ఉపయోగించే టిచింగ్ లెట్రసీ మెటీరియల్ విద్యార్థుల యొక్క అభ్యాసన యొక్క సామర్థ్యం మెరుగు పరిచే విధంగా ఉండాలని ఆదేశించారు. మౌళిక భాషా, గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమాల ద్వారా విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, విద్యార్థుల వారి తరగతికి అవసరమైన కనీస సామర్థ్యాలు కలిగి ఉండేలా అభ్యాస ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రీకృత బోధన జరగాలని, ఉపాధ్యాయులు బోధన ప్రణాళికలు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు సాధించుటకు తగినట్లు రూపొందిచుకొని కొనసాగించాలని, బోధనలో వినూత్న పద్దతులు ఉపయోగిస్తూ విద్యార్థులను పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వై.కమలాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, వెంకన్న, సంధ్య, భాస్కర్‌రెడ్డి, భోధన పరికరాలతో భోధనా అభ్యాసాల గురించి వివరించారు.

## కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**తుంగతుర్తి ప్రభాతవార్త**




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్మికులకు ఉన్న హక్కులను హరించు వేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నియోజకవం స్థాయిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలో పాల్గొని ప్రసంగించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమం విస్మరించి కార్మిక చట్ట సవరణ పేరుతో ఉన్న హక్కులను హరించడం కోసం ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో స్వతంత్రానికి పూర్వమే బ్రిటిష్ పాలకుల పైన పోరాటం చేసి సాధించుకున్న నాటి హక్కులను సైతం నేటి ప్రభుత్వాలు నలభై రెండు రకాల చట్టాలను నాలుగు గోడలుగా విభజించి బడా పెట్టుబడిదారులు శ్రమ దోపిడీదారులకు అండగా నిలవడం కోసం కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని అన్నారు. తక్షణమే కార్మిక చట్ట సవరణ పేరుతో రూపొందుతున్న విధానాన్ని రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఎఫ్‌పై ఉన్న వడ్డీ శాతాన్ని తగ్గించడం కార్మికుల పొట్ట కొట్టడమేనని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం కోసం ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని దానికి వ్యతిరేకంగా అనేక సమరశీల పోరాటాలు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో విచ్ఛిన్నకర శక్తుల తో మతోన్మాదుల కు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం బలహీన కార్మిక ప్రజల యొక్క స్థితిగతులను పరిస్థితులను అర్థం చేసుకునే పరిస్థితి లేదని దేశంలో నిత్యావసర వస్తు ధరలు ఆకాశాన్నంటుతున్న వాటిని నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. దేశంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు రోజురోజుకీ పర్సంటేజ్ ప్రకారం పెరుగుతున్నాయని ఇది కేంద్ర ప్రభుత్వం యొక్క కనుసన్నల్లో జరుగుతుందని ఆయన అన్నారు. కార్మికులకు కనీస జీతం 26 వేలు ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షులు బొంకురి శామ్ సుందర్ ,పాల్వాయి పున్నయ్య లు రైతు సంఘం జిల్లా నాయకులు ఎల్లంల యాదగిరి ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు బొంకురి శ్యాంసుందర్, పాల్వాయి పున్నయ్య నియోజకవర్గ గౌరవాధ్యక్షులు న్యాయవాది గుగులోతు రాజారాం, ఏఐటియుసి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోట రామస్వామి, యూనియన్ నాయకులు సగం హుస్సేన్, నర్సయ్య, లింగమల్లు, శ్రీను, నసీర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని ప్రధాని మోడీకి పోస్ట్



**తుంగతుర్తి ప్రభాతవార్త** చేనేత కార్మికుల సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకొచ్చేందుకు లక్షలాదిగా ఉత్తరాలు రాయాలని టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖీ మంత్రి కేటిఆర్‌ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలో శాసనసభ్యులు శ్రీ డా.గాదరి కిశోర్ కుమార్ ఆదేశం మేరకు వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్ ప్రధాని నరేంద్ర మోడీకి ఒక పోస్ట్ కార్డుని రాశారు. మేరకు ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలపై జిఎస్టిని వెంటనే రద్దు చేయాలని కోరారు. దీనివల్ల చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని అన్నారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణి

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థినిలకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో విద్యార్థినులు ఎలా ఉండాలి, ఏ విధంగా అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలో సూచనలు ఇచ్చి కళాశాల విద్యార్థినిలలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి సి.రమణి, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ చంద్రకళ, కళాశాల అధ్యాపకురాలు అరుణ, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజేత డిగ్రీ కళాశాలలో స్వాగత వేడుకలు

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**




పట్టణంలోని సాయికృప వారి విజేత డిగ్రీ అండ్ పిజి కళాశాలలో స్వాగత వేడుకలు స్థానిక వైఎస్ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దరిపల్లి నవీన్‌కుమార్, కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు దరిపల్లి అనంతరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దరిపల్లి నవీన్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో సాయికృత డిగ్రీ అండ్ పిజి కళాశాలకు 10కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దరిపల్లి ప్రవీన్‌కుమార్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కళాశాలకు వచ్చి విద్యార్థినీ, విద్యార్థులకు గోల్డ్‌మెడల్ అందించి ప్రోత్సహించారిన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పిజి కళాశాల ప్రిన్సిపాల్ యాకూబ్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ రాము, వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రావణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మహేందర్, అధ్యాపకులు బిక్షపతి, యాక స్వామి, చైతన్య, శేఖర్, రాజు, దీపిక, మాధవి, మోయిన్, క్రాంతికుమార్, శ్రీను, పరుశరాములు, కవిత, కేశవకుమార్, స్రవంతి, నరేందర్‌రెడ్డి, నామోజు రమేష్, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

## బిసిడబ్ల్యూయు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



నవంబర్ 8,9 తేదీలలో మహబూబాబాద్‌లో జరిగే బిసిడబ్ల్యూయు 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొరిగె శ్రీరాములు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం జగదేవ్‌పూర్ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మిక అడ్డాలో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి పాత చట్టాలను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. కనీస ఫించన్ 5వేలు ఇవ్వాలని, ప్రమాద మరణానికి 10లక్షల రూపాయలు, సహజ మరణానికి 5లక్షలు, వివాహ ప్రసూతి కానుక కింద లక్షరూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, పోచయ్య, లక్ష్మణ్, సుశీల, లక్ష్మయ్య, జంగయ్య, లింగయ్య, వెంకటేశం, సుధాకర్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ మహాసభలకు విరాళాలు

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



నవంబర్ 20,21 తేదీలలో భువనగిరిలో జరుగనున్న అంగన్‌వాడీ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కొండమడుగు, బీబీనగర్ సెక్టార్ల అంగన్‌వాడీలు శనివారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మికి విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికచేయబడ్డ 500 మంది ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు 2రోజులపాటు భోజన బస తదితర వసతులు కల్పించాల్సి ఉన్నందున మహాసభ ప్రారంభం రోజున బహిరంగసభ నిర్వహిస్తున్నామని టీచర్లు, ఆయాలు పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షులు బురుగు స్వప్న, షాహెద,శోభ, శారధ, పద్మ, హైమావతి, పద్మ, సరస్వతి, బాలమణి, రాధిక, ధనలక్ష్మి, నాగలక్ష్మి, వరమ్మ, భాగ్య, శ్యామల, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఫంక్షన్‌హాలు ప్రహరీగోడకు శంకుస్థాపన

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



కార్తీకమాసం సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు బింగి బిక్షపతి ఆధ్వర్యంలో శివభక్త మార్కెండేయ ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించి నూతన ఫంక్షన్‌హాల్ కార్యక్రమంలో భాగంగా నూతన ప్రహరీగోడను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యవర్గం కులపెద్దలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొంగర రవిందర్, దొంత లక్ష్మణ్, అల్లె బాలలింగం, చిట్టిపోలు శ్రీధర్, ఎలిమినేటి కుమార్, బడుగు నర్సింహ్మా, రచ్చ శ్రీరాములు, బడుగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



పట్టణంలోని 17వ వార్డు శ్రీరాంనగర్‌కు చెందిన దారపు ఎర్రమ్మ అనారోగ్యంతో మృతిచెందగా కౌన్సిలర్ చెన్న స్వామి మహేశ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం 5వేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాదె శ్రీనివాసు, దారపు నాగరాజు, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



భువనగిరి శివారు హుస్నాబాద్‌లో పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులను ఆశ్రయచించకుండా నేరుగా పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయక అధికారిణి పరిమళాదేవి, క్లస్టర్ అధికారులు వెంకట్‌రెడ్డి, ఎఇఒ అనిల్, సిబ్బంది మల్లేశం, కొనుగోలు కేంద్రం ఇంచార్జి సుదర్శన్, సరిత తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ అధ్వర్యంలో రూమ్‌హీటర్, గ్రీజర్ అందజేత

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**




పట్టణంలోని విద్యానగర్ శిశుగృహాలో చిన్నారులకు రోజువారి అవసరాల నిమిత్తం చలికాలం నుండి చిన్నపిల్లల రక్షణ కోసం 12 వేల రూపాయల గ్రీజర్, రూమ్ హీటర్‌లను శనివారం వివేరా గ్రూప్ అధినేత సద్ది వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మెంబర్సిప్ తెలంగాణ రీజియన్ ఎంపాల బుచ్చిరెడ్డి, గడ్డం జ్ఞానప్రకాశ్‌రెడ్డి, బాలాజి, ఫీక్కీరు కొండల్‌రెడ్డి, జయశ్రీ, పులిగుజ్జు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## తోటి విధ్యార్థికి ఆర్థిక సహాయం అందించిన విధ్యార్థులు

**అడ్డగూడూర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



మండలంలోని కోటమర్తి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో శీల సోమమల్లు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను 10వ తరగతి 2019 పూర్వ విద్యార్థులు మృతుని కుమార్తె అదే బ్యాచ్‌కి చెందడంతో తోటి మిత్రులు 8వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శీల గంగ సభ్యులకు అందజేసి ఆపద సమయంలో సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

## వరికోనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన వ్యవసాయాధికారిణి

**మోటాకొండూర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**



మండల పరిధిలోని కాటపల్లి గ్రామంలో వరికొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారిణి సుబ్బారి సుజాత శనివారం సందర్శించి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎగ్రేడ్ ధాన్యానికి రూపాయలు 2060, బిగ్రేడ్‌కి 2040 రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు. వరిధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. నాణ్యమైన వరిధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రమేశ్, రైతులు నర్సిరెడ్డి, రాజు, నవీన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించిన దంపతులు

**రాజపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త** రాజాపేట ఉపసర్పంచి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెజుగం రాజేశ్వర్ గుప్త రాధిక దంపతులు శనివారం శత రుద్రాభిషేకం, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మంటపాన్ని విశేష పూల తో అందంగా అలంకరించారు. మొదటగా శ్రీ గణపతి పూజ కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం శత రుద్రాభిషేకం నిర్వహించారు .ఈ సందర్భంగా వేద బ్రాహ్మణోత్తములు మంత్రోచ్చారణలతో కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు .అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని జరిపారు. మొదటగా ఉత్సవమూర్తులను ఊరేగింపుగా జయ జయ ద్వానాల మధ్య భక్తుల కోలాటాల మధ్య పరిణయ వేదిక పైకి తీసుకొచ్చారు. మల్లికార్జున శర్మ మహేష్ శర్మ ఇతర వేద బ్రాహ్మణ బృందం చే పరిణయ మంత్రోచ్చారణ కార్యక్రమాలు జరిగాయి. శ్రీ స్వామి అమ్మవార్లకు బెజ్జగం రాజేశ్వర్ రాధికా దంపతులు పాదపూజ నిర్వహించారు. రక్షాబంధనం,



యజ్ఞోపవేతం, మధుపర్కం, కన్యాదానం, పట్టు వస్త్రాల సమర్పణ, జంధ్యాపవేతం, జీలకర్ర బెల్లం ప్రధానం, తలంబ్రాలు, వడి బియ్యం సమర్పణ, మంగళ హారతులు, ఇతర విశేష కార్యక్రమాలను అద్భుతంగా నిర్వహించారు, పాల్గొన్న భక్తజనులు కనుల పండుగగా తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. జన్మధాన్యంగా భావించారు శ్రీ స్వామివారి కళ్యాణం విన్న చూసిన కలిగే ప్రయోజనాలను వేద



బ్రాహ్మణోత్ములు వివరించారు. శ్రీ స్వామివారి కీర్తనలతో నామస్మరణతో ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం తీర్థ, ప్రసాద వితరణ సామూహిక భోజనాల కార్యక్రమాన్ని పుణ్య దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, ఆప్తులు, నాయకులు, గ్రామస్తులు, పెద్దలు ,మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపటినుండి యాదాద్రిలో బ్రేక్ దర్శనాలు

**యాదగిరిగుట్ట, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఈనెల 31వ తేదీ నుండి వీవీపీ బ్రేక్ దర్శనాలకు కల్పిస్తూ ఈవో గీత ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ స్వామివారి దర్శనానికే విచ్చేసే వివిపి, వివిఐపీ భక్తులు ,రాజ్యాంగబద్ధ పదవులలో గలవారు, సిఫారసులపై వచ్చే భక్తులకు ఇతర ఆసక్తి గల సామాన్య భక్తులకు వివిపి బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నట్లు 200 టికెట్లు మించకుండా అవకాశం కల్పిస్తున్నట్లు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఈవో కోరారు.

# దేశ భవిష్యత్తును మార్చేలా భారత్ జోడోయాత్ర

**టిపీసీసీ మెంబర్, అఖిలభారత ఆదివాసి కాంగ్రెస్ కోఆర్డినేటర్ నేనావత్ కిషన్ నాయక్**

**దేవరకొండ అక్టోబర్ 29 ప్రభాతవార్త**



దేశ భవిష్యత్తును మార్చే దిశగా రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర కొనసాగుతుందని తెలంగాణ పిసిసి మెంబర్, అఖిలభారత ఆదివాసి కాంగ్రెస్ కోఆర్డినేటర్ నేనావత్ కిషన్ నాయక్ అన్నారు, శనివారం తెలంగాణలో నాలుగో రోజు మహబూబ్ నగర్ నుంచి జడ్చర్ల వరకు 20 కిలోమీటర్ల మేర కొనసాగిన రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు, భారత్ జోడోయాత్ర ఒక సంకల్పంతో చేస్తున్నదని, యావత్ భారతదేశాన్ని ఏకం చేసే లక్ష్యంతో రాహుల్ గాంధీ పాదయాత్రను చేస్తున్నారని ఆయన వెల్లడించారు, భారత్ జోడోయాత్రకు వస్తున్న ప్రజాస్పందన భారత భవిష్యత్తు రాజకీయ మార్పులకు సంకేతమని ఆయన పేర్కొన్నారు, పాదయాత్ర ఉత్సాహంగా కొనసాగుతుందని, రాహుల్ గాంధీ స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారని ఆయన తెలిపారు, భారత్ జోడోయాత్ర ద్వారా ప్రజల్లోకి కాంగ్రెస్ బలంగా చొచ్చుకు పోతుందని, కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు, రైతును కూలిగా కాకుండా రైతును ఒక రాజుగా చూడాలనే దృఢ సంకల్పంతో రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు, ఈ పాదయాత్రలో ఆయన వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దేవరకొండ కౌన్సిలర్ నేనావత్ ప్రవళిక తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,

# నిరుద్యోగులకు అన్నివిధాల సహాయం

**మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం**

**నకిరేకల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత నిరుద్యోగ శిక్షణ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్, యస్.ఐ పరీక్షలకు హాజరై ప్రాథమిక పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన 42 మంది నిరుద్యోగ విద్యార్థిని, విద్యార్థులను శుక్రవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సన్మానించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ద్వారా 3 నెలలుగా 192 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ మరియు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయగా, అందులో 42 మంది విద్యార్థులు యస్.ఐ, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు రేపటి నుండి వ్యాయామ పరీక్షలకు హాజరైటందుకు వారికి పూర్తి సహకారలతో పాటు, స్టేడియం ఏర్పాటు చేసి, ప్రాక్టీస్ కొరకు ట్రైనర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జి.కె. ఫ్యాకల్టీ వేముల సైదులు, ఎంపిటిసి వీరార్జున్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ నకిరేకంటి నరేందర్, టీచర్ వెంకటేశ్వర్ రావు, నాయకులు చెవుగోని శ్రీనివాస్, యాసరపు వెంకన్న, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, వీరెందర్, జహంగీర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను చులకన చూస్తున్న ఎమ్మెల్యే

**టిపిసిసి నేత దైద రవీందర్**

**నకిరేకల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నకిరేకల్ నియోజకవర్గ ప్రజలను చాలా చులకన భావంతో చూస్తున్నారని, ఉన్నాయ్ సర్వనాశనం చేసి అభివృద్ధి అనటం ఎంతవరకు సమంజసమని టిపిసిసి కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ విమర్శించారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలో పలు సమస్యలను పరిశీలించి మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలు తాండవిస్తున్నాయని, నకిరేకల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్నీ మండలాల రోడ్లు బాగుచేయాలి బాబోయ్ అని ప్రజలు, ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్న చెవిటోని ముందు శంఖం ఊదినట్టే ఉంది ఎమ్మెల్యేకన్నారు. ఎప్పుడో కూలగొట్టిన ఎంపిడిఓ ఇంతవరకు కట్టలేదని,మళ్ళీ కొత్తగా అక్కడ ఉన్న భవనాలు కూలగొట్టి సమీకృత మార్కెట్ అంటే ఎలా మరి అన్నారు. దళితుల సమాధులు కూలగొడితివని, ఎమ్మార్వో ఆఫీ సు కూలగొట్టి 100 పడకల ఆసుపత్రి అన్నారని, ఇప్పుడు నకిరేకల్‌కే తలమానికంగా ఉన్న స్టేడియం మీద పడితివి ఇది భావ్యమా ఎమ్మెల్యే అని ప్రశ్నించారు. నకిరేకల్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, ఇప్పటికైనా పక్క నియోజకవర్గ ప్రచారం ఆపి సొంత నియోజకవర్గం అభివృద్ధి మీద దృష్టి సారించి స్టేడియం అప్పుడు ఎలాగుందో అలా తీర్చిదిద్దే కార్యక్రమం చేయాలని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రజల పక్షాన డిమాండ్ చేశారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**కట్టంగూర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



రైతులకు మద్దతు ధరకు కొనుగోలు చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కట్టంగూర్ పిఎసిఎస్ సిఈఓ బి.మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మండలంలోని అయిటిపాములలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా సిఈఓ మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోకుండా ఉండేందుకుగాను ప్రభుత్వం ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, వాటిద్వారా విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి ఎన్.రాంబాబు, పిఎసిఎస్ సిబ్బంది చెరుకు చంద్రయ్య, కె.సైదులు, సిహెచ్ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

# ప్రియా సిమెంట్ కాలనీలో 26 తులాలు బంగారం చోరీ



**మేళ్ళచెరువు అక్టోబర్ 29 ప్రభాతవార్త**

మండలంలోని ప్రియా సిమెంట్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడి విఘ్నేశ్వర్‌రావు, వినోద్‌రెడ్డి, అభినవ్, శంకరరెడ్డి ఇండ్లల్లో 26 తులాల బంగారం, రూ.1 లక్ష 20వేల నగదు దోచుకున్నారని ఎస్ఐ సురేష్‌యాదవ్‌శనివారం తెలిపారు. కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అన్నారు.

# గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

**మండల సభ దృష్టికి తీసుకువచ్చిన సభ్యులు**

**కట్టంగూర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు మండల సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈమేరకు శనివారం ఎంపిపి జెల్లా ముత్తిలింగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఎక్సైజ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైన్స్ దుకాణాదారులు మధ్యాన్ని ఎంఆర్‌పి ధరలకు అమ్మకుండా బెల్ట్ షాపులకు అధిక రేట్లకు అమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపిపి జెల్లా ముత్తి లింగయ్య, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చూచిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభలో వివరిస్తూ వాటిని పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జడ్పీటిసి తరాల బలరామ్, మండల తహశీల్దార్ గుగులోతు దేశ్యానాయక్, ఎంపిడిఓ పోరెళ్ల సునీత,ఎంఈఓ మేక నాగయ్య,ఎక్సైజ్ ఎస్ఐ ఇ.రామకృష్ణ, పీఆర్,విద్యుత్ శాఖల ఏఈలు జలీల్, కుమార్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏపీఓ కడెం రాంమోహన్, ఏపీఎం చౌగోని వినోద, సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

# ఘనంగా కార్తీక మాస పూజలు

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో గల శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో కార్తీక మాసంలో తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయంలో విష్ణు, లలితా సహస్రనామాలు, నియమార్చన, అభిషేకాలు తదితర పూజ కార్యక్రమాలలో మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం చీదెళ్ల వెంకన్న, మిర్యాల యాదయ్య దంపతులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పూలే జనార్దన్, ప్రధాన కార్యదర్శి గౌరు వెంకటేశ్వర్లు, నీలా లక్ష్మయ్య, కామిశెట్టి పాండరయ్య, బూర్గు కుమార్, అల్లంపల్లి రాములు, పోలా శంకరయ్య, గోవిందు, జగతయ్య, మిర్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవల మరవలేనివి

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని గుమ్మడవెల్లి జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎడవ వార్డు సభ్యులు, గుమ్మడవెల్లి జనార్దన్ దీపావళి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీల పని చేసే ప్రతి ఒక్క పారిశుధ్య కార్మికునికి ఒక్కొక్కరికి ఆరకిలో చొప్పున మాంసం అందజేశారు. ఈ ఆయన మాట్లాడుతు నిత్యం గ్రామ పరిశుభ్రతకు పాటు పడే పారిశుధ్య కార్మికుల సేవలు అమోగమని అన్నారు. నేడు పట్టణాలు, పల్లెలు పరిశుభ్రంగా ఉన్నాయంటే అధి పారిశుధ్య కార్మికుల వల్లనే అని అన్నారు. తమ సేవలను గుర్తించి మా మీద అభిమానంతో మాంసం. అందజేసిన వార్డు సబ్యుడు జనార్ధనక్కు గ్రామపంచాయతీ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

# గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపిపి

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



కొండమల్లేపల్లి మండల పరిధిలోని మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలించి అక్కడ ఉన్న సమస్యల గురించి విద్యార్థులను,ఉపాధ్యాయులను నేరుగా అడిగి తెలుసుకున్నారు కొండమల్లేపల్లి ఎంపిపి దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి. ఈమేరకు శనివారం ఆమె సందర్శించి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం కల్పించాలి అని ఉపాధ్యాయులకు సూచించారు .ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకళ యువజన కాంగ్రెస్ నేతలు మంగ్యనాయక్, ఏకుల సురేష్, సుమన్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కో-ఆర్డినేటర్ యం.డి. ఖదీర్, రామావత్ సేవ నాయక్,కార్తిక్, నాగేష్, నాగేంద్ర, రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# హైజంప్‌లో చెరుకు పల్లి విద్యార్థి ప్రతిభ

**డిండి, అక్టోబర్ 29 ప్రభాతవార్త** హనుమకొండ జెఎన్ఎస్ (జవహర్ లాల్ నెహ్రు స్టేడియం) స్టేడియంలో జరిగిన తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో అండర్-16 హై జంప్ విభాగంలో చెరుకుపల్లి విద్యార్థి కాట్రావత్ గణేష్ కాంస్య పతకం సాధించారు. ఈసందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, పిఇటి లెనిన్ బాబు ఉపాధ్యాయులు తిరుపతయ్య, జయరాజు, సృజన, రమాదేవి, వేణు, ప్రభావతి, ధనమ్మ, లాల్ సింగ్, శ్రీను,వీరాస్వామి, ముడి శ్రీను వహీద్, చాంద్, రమేష్, రాంరెడ్డి అభినందించారు.

# మండల సభలో సమస్యల చిట్టా

**గోడు వెల్లబోసుకున్న ప్రజాప్రతినిధులు**

**డిండి, అక్టోబర్ 29 ప్రభావార్త**




మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు తమ సమస్యలను మండల సభలో ఏకరువుపెట్టారు. ఈమేరకు శనివారం ఎంపిపి మాధవరం సునీతాజనార్ధన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. డిండి పట్టణంలోని ఎస్సీకాలనీలో మిషన్ భగీరథ నీరు రావడంలేదని ఎంపీటీసీ బూషిపాక వెంకటయ్య సభా దృష్టికి తీసుకువచ్చారు. సింగరాజుపల్లి రామంతాపూర్ వెళ్లే రోడ్డు మార్గం సరిగ్గా లేదని వెంటనే అధికారులు పట్టించుకొని ఆ మార్గాన్ని సరిచేయాలని ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి సభలో ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని పలువురు ఎంపీటీసీలు సర్పంచులు సభలో వాపోయారు. ఇప్పటివరకు ఇంకా ఈకేవైసీ నమోదు చేసుకోని వాళ్ళు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏఈఓ వెంకటేష్ తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత మండల అధికారులు కృషి చేయాలని సూచించారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరందాసు లక్ష్మమ్మకృష్ణయ్య, వైస్ ఎంపీపీ పుల్లమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు మాధవరం శ్రీనివాసరావు, నాగార్జునరెడ్డి, ఎంపిడిఓ డానియేల్, తహసీల్దార్ ప్రశాంత్,పీఆర్ఏఈ విజయ్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ విజయ్, వివిధ శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

# అనాజిపురంలో ఐకెపి కేంద్రాన్ని ప్రారంభించాలి

**భువనగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో ఐకెపి కేంద్రాన్ని ఇప్పటివరకు ప్రారంభించలేదని, వెంటనే ప్రారంభించాలని సిపిఎం పార్టీ కార్యదర్శి ఏదునూరి వెంకటేశం డిమాండ్ చేశారు. రైతులు వరిధాన్యాన్ని దాదాపుగా నెల నుండి కేంద్రానికి తీసుకువచ్చారని కాని ఇప్పటివరకు గ్రామంలో ఐకెపి కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొంతమంది రైతులు కేంద్రాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియక దళారులకు వరిధాన్యాన్ని అమ్ముకుంటున్నారని అన్నారు. రైతులు తెచ్చుకున్న పట్టాలకు కూడా కిరాయి ఎక్కువ అవుతుందని వెంటనే ఐకెపి కేంద్రాన్ని ప్రారంభించి వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# దుకాణదారులకు నోటీసుల అందజేత

**హాలియా, ప్రభాతవార్త. అక్టోబర్ 29:**



హాలియా మున్సిపాలిటీలోని జాతీయ రహదారి వెంట ఉన్న డ్రైనేజీని అక్రమించుకొని వ్యాపారం చేసుకుంటున్న వారికి హాలియా మున్సిపాలిటీ కమీషనర్ ఆదేశానుసారం శనివారం నోటీసులను అందజేశారు. ఈసందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి అధ్వర్యంలో డ్రైనేజీ అక్రమించుకొని వ్యాపారం చేసుకుంటున్న వారికి అవగాహన కల్పిస్తూ ఖాళీగ చేయాల్సిందిగా అదేశాలను జారీ చేశారు. ఎవరైనా డ్రైనేజీనిఇ అక్రమించుకొని వ్యాపారం చేసినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గురుకుల ఉపాధ్యాయుల పనివేళలు తగ్గించాలని నిరసన

**హాలియా, ప్రభాతవార్త. అక్టోబర్ 29:**



హాలియా మున్సిపాలిటీలోని నిర్మల విద్యామందిర్ పాఠశాలలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల పని వేళలను తగ్గించాలని శనివారం మధ్యాహ్నం భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించి పని వేళలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. నిరసన తెలియజేసిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమాదేవి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రేపు మండల సర్వసభ్య సమావేశం

**హాలియా, ప్రభాతవార్త. అక్టోబర్ 29:**

అనుముల మండల సర్వసభ్య సమావేశాన్ని అనుముల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీవో లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు తమ తమ అభివృద్ధి ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

# అంగన్‌వాడీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**భూదాన్‌పోచంపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** నవంబర్ 20.21 తేదీలలో భువనగిరిలో జరుగనున్న అంగన్‌వాడీ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి పరిధిలోని జూలూరు సెక్టార్ల అంగన్‌వాడీలు మహాసభలకు విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ మహాసభను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, ఆయాలు పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జల్లా అధ ్యక్షు లు బూరుగు స్వప్న, యూనియన్ నాయకులు సునంద, పారిజాత, శోభ, కవిత, హేమలత, చంద్ర కళ, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్ యుటిఎఫ్ మండల నూతన కమిటి

**నేరేడుచర్లటౌన్ అక్టోబర్ 29 ప్రభాతవార్త**

నేరేడుచర్ల మండల టిఎస్ యుటిఎఫ్ నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వై.కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.మాధవి, ఎ.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎం.యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బి.అక్కయ్యబాబులు ఎన్నికయా ్యరు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు ఎస్.అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఆర్.రవీందర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటి సభ్యుడు ఎన్.సాంబయ్యలు వ్యవహరించారు.

# పశువులకు లంపీ వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలి

**మాడ్గులపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:**

ఇటీవల పశువులకు వ్యాపిస్తున్న లంపీ వ్యాధి నివారణకు అవసరమైన చర ్యలను చేపట్టి పశువులన్నింటికి వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సిపిఎం సీనియర్ నాయకులు నల్లు గౌతంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పుచ్చకాయలగూడెం గ్రామంలో లంపీ వ్యాధి సోకిన పశువులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో లంపీ వ్యాధి సోకి పశువులు చికిత్స లేని కారణంగా ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో పశువుల పెంపకదారులు ఉన్నారని, ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి పశువులన్నింటికి లంపీ వ్యాధి నిరోధక టీకాలను ఇప్పించాలన్నారు. లేని పక్షంలో పశువుల పెంపకదారులు పెద్దఎత్తున నష్టం చవిచూడాల్సి వస్తుందన్నారు. వా ్యధి కారణంగా మృతి చెందిన పశువులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల సీపీఎం కార్యదర్శులు పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, బొమ్మగాని అంజయ్య, బొడ్డు మారయ్య, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

**తిరుమలగిరి అక్టోబర్ 29 ప్రభాతవార్త**



తిరుమలగిరి మండలంలోని 112 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతరాజు రజిని రాజశేఖర్, ఎంపిపి నెమరుగొముల స్నేహలతలు శనివారం అందజేశారు. రా ష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసమే చేపడుతున్న పథకాలు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ నిరుపేద ఆడపిల్లల తల్లిదండ్రు లకు రూ.1 లక్ష 116లు అందజేయడంతో ఎంతో మేలు కలుగుతుందన్నారు. చెక్కులను అందుకున్న పేదలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేసు ్తన్న ప్రభుత్వానికి అండగానిలవాలని కోరారు. సిఎం కెసిఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక ్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి దూపటి అంజలి, తహసిల్దార్ రమణారెడ్డి, ఎంపిడివో ఉమేష్‌చారి, డిటి కళా ్యణ్, ఆర్ఐ ప్రసన్నతదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ

**మోటాకొండూర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చందేపల్లి గ్రామానికి చెందిన బొట్ల ఉప్పలయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు ఎల్లంల సంజీవరెడ్డి 5వేల రూపాయల ఆర్థిక సహాయం మరియు బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెమ్మడి సుబ్రమణ్యం, బొట్ల నర్సింగరావు, గంగరాజు సాగర్, సిద్దిరాంరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, లక్ష్మినర్సయ్య, సంజీవ, నరేశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపంపిణీ బియ్యం పట్టివేత

**కట్టంగూర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త** అక్రమంగా తరలిస్తున్న ప్రజాపంపిణీ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఈమేరకు ఇందుకు సంబంధించి కట్టంగూర్ ఎస్ఐ డి.విజయ్‌కుమార్ అందించి వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఎస్ఐ కట్టంగూర్ గారికి వచ్చిన నమ్మదగిన సమాచారము మేరకు బొల్లేపల్లి గ్రామము నుండి ఒక వాహనములో పిడిఎస్ బియ్యాన్ని అక్రమముగా తరలిస్తున్నారని తెలిసి తమ సిబ్బందితో వెళ్లామని, బొల్లేపల్లి గ్రామము వెళ్ళగా చిన్న సూరారం రోడ్ లో చర్చ్ సమీపమున బియ్యము లోడ్‌తో ఆగి ఉన్న గూడ్స్ వాహనమును దాని యొక్క డ్రైవరు తండ్రు శ్రీను బొల్లేపల్లి గ్రామము అను అతడిని పట్టుబడి చేసి విచారించగా తాను తక్కువ దరకు గ్రామస్తుల నుండి పిడిఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి హైదరాబాద్ తరలించి పౌల్ట్రీ ఫార్మ్స్ లలో ఎక్కువ ధరకి అమ్ముట గురించి తరలిస్తున్నట్లుగా ఒప్పుకున్నాడు. గూడ్స్ వాహనమును 98 బస్తాల పిడిఎస్ రైస్ 50 కేజీల బస్తాలు మొత్తము 4 900 కీజీలు స్వాధీన పర్చు కొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నకిరేకల్ సివిల్ సప్లై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాచకొండ జ్యోతి, పోలీస్‌సిబ్బంది సైదులు, రెవెన్యూ సిబ్బంది మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని ముక్కుసిగ వేసి మునుగోడుకు తీసుకు వచ్చా

**చింతపల్లి అక్టోబర్ 29 ప్రభాతవార్త**ఏనాడు అసెంబ్లీలో మునుగోడు ప్రాంత ప్రజల సమస్యలు వినని ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ముక్కుకు ముక్కసిగ వేసి మునుగోడు ప్రాంత ప్రజల ముందు నిలబెట్టానని బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండలపరిధిలోని తిరగండ్లపల్లి, తమ్ముడపల్లి గ్రామాలలో ముమ్మర ప్రచారాని న్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ 1200 మంది విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ఏర్పడిన తెలంగాణను ముఖ్యమం త్రి కెసిఆర్ తమ కుటుంబ పాలనగా మార్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేటి వరకు యువతకు విద్య, ఉద్యోగ, ఆరోగ్య, వ్యవసాయాన్ని తుంగలో తొక్కి రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగిస్తున్నారని, అలాంటి నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను, అభివృద్ధిని కాంక్షిస్తూ తాను అసెంబ్లీలో మొర పెట్టుకున్నా నా మాట వినకుండా పెడచెవిన పెట్టారని, అందుకోసమే రాజీనామా చేసి ఎన్నికల బరిలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ఉప ఎన్నికలు అవినీతి ప్రభుత్వానికి, ధర్మయుద్ధానికి జరుగుతున్న ఎన్నికలు అన్నారు. మునుగోడులో నన్ను ఒక్కడిని ఓడించేందుకు 100 మంది కౌరవ సైన్యంను, ప్రభుత్వ యంత్రాంగాంను ముఖ్యమంత్రి కెసిఆర్ దింపారని, మరో 200మంది ఎమ్మెల్యేలు, మంత్రులు వచ్చినా నన్ను ఓడించలేరని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దోచుకొని దాచుకునారని, వారికి దోచుకున్న సొమ్మును కక్కేటట్టు చేసి జైలుకు పంపడం ఖాయమన్నారు. తాను మునుగోడు ప్రాంత అభివృద్ధి కోసమే బిజెపిలో చేరానని, నరేంద్ర మోడీ నాయకత్వాన తెలంగాణ రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ సమస్యలపై పోరాడేందుకు తిరిగి నాకు అసెంబ్లీలో ప్రశించేందుకు ఓట్లు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట పలువురు బిజెపి నాయకులు గోపిడి



అనిల్‌రెడ్డి, విజయ రాంరెడ్డి, తమ్ముడపల్లి సర్పంచ్ కొట్టం మాధవి రమేష్ యాదవ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తూళ్ల ఉమ, గ్రామశాఖ అధ్యక్షుడు వి.మల్లేష్ యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, మురళి యాదవ్, బుచ్చయ్య యాదవ్, యాదగిరి, ఎండి.రియాస్, రామచంద్రం, మహిళలు పాల్గొన్నారు.

## సోమప్పలో భక్తి శ్రద్ధలతో నాగ పంచమి

**నేరేడుచర్లరూరల్ అక్టోబర్ 29 ప్రభాతవార్త**



నేరేడుచర్ల మండలంలోని బూర్గులతండా గ్రామపంచాయితీ పరిధిలోని మూసీనది ఒడ్డున ఉన్న శ్రీభృగు మాలికాసోమప్ప సోమేశ్వర ఆలయంలో నాగుల చవితి సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై నాగుపాము పుట్ట కు భక్తి శ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా పాలు, కోడిగుడ్లు, పూలు పెట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాహాజరైన మహిళలు సోమప్ప, సోమేశ్వరునికి అర్చన చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామికిప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమప్ప ఆలయ కమిటి చైర్మన్ రాచకొండ శ్రీనివాసరావు, పాల్వాయి అనిత రమేష్, మంజు రవీందర్‌రెడ్డి, సుకన్య కృష్ణయ్య, సునిత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్‌లోకి చేరికలు

**– మునుగోడులో ప్రభాకర్‌రెడ్డి విజయం ఖాయం**

**చింతపల్లి అక్టోబర్ 29 ప్రభాతవార్త**



మునుగోడు ఉప ఎన్నికలలో భాగంగా మండలపరిధిలో తిరగండ్లపల్లి, తమ్ముడపల్లి గ్రామాలలో ఆదిలాబాద్ మాజీమంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం టిఆర్ఎస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తమ్ముడపల్లిలో కార్యకర్తలతో పెద్ద ఎత్తున ఊరేగింపు జరిపి ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే పలు సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో చేరువవుతున్నాయని, దీంతో ప్రజలు టిఆర్ఎస్‌కు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఉప ఎన్నికలు అహంకారానికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఎన్నికలు అని, రాజగోపాల్‌రెడ్డిని ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ అని, ప్రజాస్వామ్యం కోసం పని చేసే వ్యక్తులకే ప్రజలు ఓట్లు వేయాలన్నారు. ప్రాంత అభివృద్ధికి పని చేసి ప్రజల మధ్య ఉండే వ్యక్తి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట గ్రామశాఖ అధ్యక్షులు కొట్టం శివయాదవ్, ఎక్స్ సర్పంచ్ ఎ.నర్సింహగౌడ్,ఎంపిటిసి హరికృష్ణ, మంచాల యాదగిరి, వెంకటాచారి, ఎండి.రజాక్, జంగయ్యయాదవ్, మెస్కిన్, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, యాదయ్య, రామాంజన్, కొండయ్య, సంతోష్‌గౌడ్, సాగర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నృసింహుని నిత్య కళ్యాణం

**మఠంపల్లి అక్టోబర్ 29 ప్రభాతవార్త** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మినరసింహస్వామి క్షేత్రంలోని శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య కళ్యాణంను అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ తంతు కార్యక్రమాన్ని వందలాది మంది భక్తుల నడుమ అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కళ్యాణాన్ని తిలకించి పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, కార్యనిర్వహణ అధికారి సిరికొండ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణ చార్యులు, లక్ష్మినర్సింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి ధరఖాస్తుల ఆహ్వానం

**కోదాడ టౌన్, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

స్థానిక కెఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. నాగు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్‌లో ఒక్కొక్క పోస్టు చొప్పున 2022-23 విద్యా సంవత్సరంలో భోదించుటకు అర్హులైన వారు ఈ నియామకానికి ఆయా సబ్జెక్టులలో పిజిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, మిగతా వారు 55 శాతం మార్కులు సాధించిన వారు మాత్రమే ధరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పిహెచ్‌డి, ఎంఫిల్, నెట్, సెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు భోదనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 2వ తేదీ వరకు కార్యాలయంలో ధరఖాస్తులు సమర్పించాలన్నారు.

## నాగేంద్రుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**కోదాడ రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త** నాగేంద్రుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎంపిపి కవితారెడ్డి పేర్కొన్నారు. శనివారం నాగుల చవితిని పురస్కరించుకుని తమ్మర నాగేంద్రస్వామి ఆలయంలో పుట్ట వద్ద ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశంలో అతి ప్రాచీన పూజా నాగారాధన అని, ఆది దేవుని నాగాభరణమైన నాగేంద్రుడిని పూజించడం శ్రావణ శుద్ధ పంచమి నాడు నాగపంచమిగాను, కార్తీక శుద్ధ చవితి నాడు నాగుల చవితిగానూ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. నాగుల చవితి నాడు మహిళలు పుట్టలో పాలు పోసి ఉపవాసంతో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆచారమని, ప్రజలంతా ఆ నాగేంద్రుడిని పూజిస్తూ ప్రజలందరికీ నాగులచవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్రా సుధారాణి, కౌన్సిలర్లు కల్లూరి పద్మజ, మేదర లలిత, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ అభ్యర్ది గెలుపు కోసం ప్రచారం

**కోదాడ రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త** మునుగోడు ఉప ఎన్నికల్లో వామపక్షాలు బలపర్చిన టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శనివారం కోదాడ టిఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సారధ్యంలో చౌటుప్పల్ మండలంలోని తూప్రాన్‌పేటలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ టిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు చింతకుంట్ల రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు మంద వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిని నాగార్జున, ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీం, విజయ్‌కుమార్, గట్ల నర్సింహరావు, ఈదుల కృష్ణయ్యయాదవ్, పాలేటి నాగేశ్వరరావుఎ, బొజ్జ రాజశేఖర్‌రెడ్డి, జానీపాషా, దావీదు, మోష, కెఎల్ఎన్ ప్రసాద్, గోవర్ధన్, హనుమంతరావు, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్రవంతి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

**నాంపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధి పాల్వాయి స్రవంతిని గెలిపించి ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఓటర్లను కోరారు. శనివారం నాంపల్లి మండలంలోని చిన్న మాందాపురంలో ఇంటింటికి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించి మహిళలకు బొట్టుపెట్టి గాజులు ఇచ్చే కార్యక్రమాన్ని మహిళలతో కలిసి నిర్వహించారు. ప్రజా సమస్యలు పట్టని టిఆర్ఎస్, బిజెపిలకు బుద్ది చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకలు గడ్డం ముత్యపురెడ్డి, గడ్డం వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మ కళాకారులకు సహకరిస్తాం

**మేళ్ళచెరువు అక్టోబర్ 29 ప్రభాతవార్త** స్థానిక మై హోం సిమెంట్, శ్రీనగర్ కాలనీ ఆడిటోరియంలో శనివారం రాష్ట్రస్థాయి ఉత్తమ కళాకారుడు తమలపాకుల సైదులు సూక్ష్మ కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మై హోం సీనియర్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాకారులకు సహకరించి కళారంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ డా.నాగేశ్వరరావుతో పాటు అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కుటుంబాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దుకాణం పాట ద్వారా ఆలయమునకు రూ.1 లక్ష రాబడి

**మేళ్ళచెరువు అక్టోబర్ 29 ప్రభాతవార్త**



స్థానిక శ్రీఇష్టకామేశ్వరి సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం జరిగిన కొబ్బరికాయలు, ప్రసాదములు అమ్ముకునే హక్కు కల్పించే దుకాణం పాటను రూ.1 లక్ష కు మోదుగులపల్లి గణేష్ దక్కించుకున్నారు. నేటి నుండి సంవత్సరం పాటు ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు, ప్రసాదములు అందుకునేందుకు హక్కును పొందారని ఆలయ కార్యనిర్వహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు, సిబ్బంది, అర్చకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి మహిళ అత్మహత్య

**మిర్యాలగూడ క్రైం, అక్టోబర్ 29 ప్రభాతవార్త** రైలు కిందపడి మహిళ అత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ కలహాలతో కాసం చంద్రకళ(31) అనే మహిళ శుక్రవారం రాత్రి రైలు పట్టాలపై పడి అత్మహత్యకు పాల్పడింది. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో గ్యాంగ్‌మెన్‌గా పనిచేసే కాసం రమేష్ భార్య చంద్రకళ కుటుంబ కలహాలతో ఇంటర్సిటి రైలు కిందపడి అత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

**మిర్యాలగూడ క్రైం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి, మిర్చి పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులను అదుకోవాలన్న పార్టీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చినట్లు పేర్కొన్నారు. తక్షణమే వ్యవసాయ అధికారులు వర్షాల కారణంగా దెబ్బతిన్న పత్తి, మిర్చి, వరి పంటల గురించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరారు. నివేదిక అధారంగా ప్రభుత్వం బాధిత రైతులకు నష్టపరిహారం అందించి అదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వస్కుల సైదమ్మ, మోహన్‌నాయక్, మారయ్య, ఎల్లమ్మ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## సేవలు విస్తరించాలి: మున్సిపల్ చైర్మన్ భార్గవ్

**మిర్యాలగూడ రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



వాసవి క్లబ్ సేవలు విస్తరించాలని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. శనివారం పట్టణంలో జరిగిన రీజియన్ సమావేశంలో అయన పాల్గొని పేద విద్యార్థుల సంక్షేమం సమాజ సేవా కార్యక్రమాలు చేయడంలో సభ్యుల కృషిని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో సంస్థ విభాగాలు ముమ్ముందు తమ సేవలు రీజియన్ వ్యాప్తంగా విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శత్రయ్య, మల్లయ్య, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**మిర్యాలగూడ క్రైం, అక్టోబర్ 29 ప్రభాతవార్త** తిరుమల కళ్యాణ కట్ట దగ్గర తలనీలాలు సమర్పించే భక్తుల నుంచి నగదు తీసుకుంటున్నారని అరోపణలతో క్షురకులను కులం పేరుతో దూషించిన విజిలెన్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ పట్టణ నాయిబ్రహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రాయించు నరసింహ డిమాండ్ చేశారు. ఫిర్యాదుల సాకుతో దుస్తులు విప్పి తనిఖీ చేయడం, కులం పేరుతో దూషించడంఅవమానకరమన్నారు. భవిష్యత్‌ల్లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా టిటిడి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నాగుల చవితి ప్రత్యేక పూజలు

**మిర్యాలగూడ క్రైం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



కార్తీక శుద్ధ చవితిని నాగుల చవితిగా నిర్వహించుకోవడం అనాయితీ. శనివారం నాగుల చవితిని పురస్కరించుకొని మిర్యాలగూడ పట్టణ పరిధిలోని తాళ్లగడ్డ అభయ అంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్ట వద్దకు మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పుట్ట చుట్టూ ప్రదక్షిణ చేసి పాలు గుడ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు అలయ కమిటి అధ్వర్యంలో షామియానాలు, బారికెడ్లతో ప్రత్యేక ఏర్పాటు చేశారు.

## బహిరంగ వేలం విజయవంతం

**మిర్యాలగూడ క్రైం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

మిర్యాలగూడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో పెద్ద సంఖ్యలో బిడ్డుదాఖలు అయ్యాయి. వేలంలో 15 ద్విచక్రవాహనాలు, 3 అటోలు, ఒక కారు, ఒక లారీని టెండర్‌దారులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎఇఎస్ చాణక్య, సిఐ నజీర్, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలి

**మునగాల, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

భావి భారత ప్రధాని రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దిగ్విజయంగా సాగుతుందని, నేడు పాదయాత్ర జడ్చర్ల నుండి షాద్‌నగర్ వరకు కొనసాగుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడతూ మండల కాంగ్రె పార్టీ నాయకులు, కార్యకర్తలు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు అంతా పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు

**మునగాల, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



నాగుల చవితి సందర్భంగా మండల కేంద్రంలోని నాగులమ్మ దేవస్థానం నందు, నాగేంద్రుని పుట్ట వద్ద మహిళా భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ శనివారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ వారు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం 3 వేల మందికి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ దేవినేని శ్రీలత, గింజుపల్లి రఘు, దేవాలయ అర్చకులు నరమనేని రామారావు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**అనంతగిరి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నాగుల చవితిని పురస్కరించుకుని శనివారం ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆలయాలకు మహర్దశ వచ్చిందన్నారు. సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ విశేష కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం, పునర్నిర్మాణం కోసం టిఆర్ఎస్ సర్కారు కృషి చేస్తుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత ఆలయాలకు పునర్వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలు సిఎం కెసిఆర్ కృషితో ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను, కామన్ గుడ్ ఫండ్ నిధులతో ఇతర ఆలయాల జీర్ణోద్ధరణ, దేవాలయాల నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలకు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి, ఎంపిపిలు చింతా కవితారెడ్డి, చుండూరు వెంకటేశ్వర్లు, చందు నాగేశ్వరరావు, కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కొండపల్లి వాసుదేవరావు, మాజీ సర్పంచ్ వీరయ్య, నాగేశ్వరరావు, చార్లెస్, వెంకటప్పయ్య, పట్టణ కౌన్సిలర్లు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు

**నడిగూడెం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



మండల కేంద్రమైన నడిగూడెం, చుట్టుపక్కల గ్రామాల్లో శనివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా భక్తిశ్రద్దలతో నిర్వహించారు. కార్తీక మాసం కావడంతో వేకువజామున మహిళలు తలంటుస్నానాలను ఆచరించి నాగేంద్ర స్వామి పుట్టల వద్దకు వెళ్లి పాలు పోశారు. పండ్లు, పాలు నైవేద్యంగా సమర్పించారు. దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేపట్టారు. కోరిన కోరికలు తీరాలని నాగేంద్ర స్వామిని వేడుకున్నారు. శ్రీ కోదండరామస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల్లో చేపట్టన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు, రాజశేఖరశర్మలు ఎంతో నిష్టతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. కాగితరామచంద్రాపురం, రామాపురం, సిరిపురం, వల్లాపురం, రత్నవరం తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో పూజల అనంతరం తీర్ధప్రసాదాల వినియోగంతో కార్యక్రమాలు ముగిశాయి.

## ఆకాశ దీపోత్సవం

**నడిగూడెం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

కార్తీక మాసంలో భాగంగా స్థానిక శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శనివారం రాత్రి ఆకాశ దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 26న ప్రారంభమైన ఆకాశ దీపోత్సవం కార్తీక మాసం పూర్తి అయ్యేంత వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వరదాచార్యులు తెలిపారు. భక్తులు ప్రమిదల్లో ఒత్తులు, నూనె వేసి దీపాలను వెలిగించుకున్నారు. ఆకాశ దీపోత్సవంలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులయ్యారు. వేణుగోపాలపురం, రత్నవరం, శ్రీరంగాపురం తదితర గ్రామాల్లో సైతం వేడుకలు భక్తిశ్రద్దలతో చేపట్టారు. తీర్ధప్రసాదాల వినియోగంతో కార్యక్రమాలు ముగిశాయి.

## తగ్గిన పత్తి దిగుబడి - ఆందోళనలో రైతన్న

**నడిగూడెం, అక్టోబర్ 29 ప్రభాతవార్త** ఆరుగాలం కష్టించి పత్తి పంట పండించగా దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి సుమారు రూ. 30 వేలు పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేయగా అధిక వర్షాలు, పత్తికి తెగుళ్ల సోకడం, వాతావరణంలో మార్పు ఫలితంగా దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని బృందావనపురం, వేణుగోపాలపురం, నడిగూడెం, కరివిరాల, కేశవాపురం తదితర గ్రామాల్లో పత్తి సాగు చేశారు. ఎకరానికి 6-7 క్వింటాల్లు పత్తి దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 2-3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడంతో గిట్టుబాటు ధర లభించక మధ్య దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. మండలంలో పత్తి తీయడం ప్రారంభమైంది. ఆ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. క్వింటా పత్తికి రూ. 10 వేలు మద్దతు ధర కల్పిస్తే తప్ప నష్టాల ఊబి నుండి బయటపడే పరిస్థితి లేదంటున్నారు. మద్య దళారీలకు తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడడంతో పెట్టిన పెట్టుబడి కూడా పూడే పరిస్థితి లేదంటున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో అధిక వర్షాలు కురవడంతో పత్తి కాయలకు బూజు పట్టి నల్లగా మారాయి. దీంతో దిగుబడి తగ్గింది. అదునులో పత్తి సాగు చేసిన రైతులు ఆశించిన దిగుబడి వస్తుందనుకున్నప్పటికీ అధిక వర్షాలు, తెగుళ్ల సోకడం తీరని నష్టాన్ని కలిగించిందంటున్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటాకు రూ. 10 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## టిఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

**నాంపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**




చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డలో నేడు నిర్వహించే ముఖ్యమంత్రి కెసిఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. శనివారం స్థానిక సునంద ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చండూరులో ఆదివారం జరిగే బహిరంగ సభకు ముఖ్యమంత్రి కెసిఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ ప్రజలకు ఏమి చేశారని బిజెపి ఓటు వేయాలో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రూ. 18 వేల కోట్ల కాంట్రాక్టు కోసం పార్టీ మారారని, ఈ ఉప ఎన్నిక వలన ఆయనకు లాభం చేకూరిందని, నియోజకవర్గ ప్రజలకు ఏమి మేలు జరగలేదన్నారు. మూడున్నర సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి గ్రామల వైపు కన్నెత్తి చూడలేదని, ప్రజల సమస్యలను తెలుసుకోలేదని ధ్వజమెత్తారు. మూడున్నర సంవత్సరాల్లో చేయని అభివృద్ధి ఉప ఎన్నికల్లో గెలిస్తే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన బిజెపి నేతలు ఏం చేస్తారో, ఏమి చేశారో చెప్పకుండా ముఖ్యమంత్రి కెసిఆర్‌ను, తెలంగాణ ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. నవంబర్ 3వ తేదీన ఎన్నిక జరుగుతుందని, ఈ మూడు రోజులు చాలా కీలకమని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి ప్రజా సంక్షేమ పథకాల గురించి అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిఎఫ్ చైర్మన్ అనిల్‌కుమార్ కూర్మాచలం, జడ్పీటీసి ఎలుగోటి వెంకటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, సర్పంచ్ కుంభం విజయ కృష్ణారెడ్డి, నాంపల్లి సత్తయ్య, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, కుంభం చరణ్, చంద్రశేఖర్, శ్రీధర్‌రెడ్డి, కామిశెట్టి పాండు తదితరులు పాల్గొన్నారు.